ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 11-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- "వికసిత్ భారత్" లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ను రూపొందించామని ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.
- లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని కేంద్రమంత్రి కిరెణ్ రిజిజు చెప్పారు.
- ఈశాన్య ప్రాంతాలకు బడ్జెట్ లో అధిక కేటాయింపులు జరిగాయని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.
- శ్వేత విప్లవం 2.0 ద్వారా రాబోయే ఐదు సంవత్సరాలలో పాల సేకరణను 50 శాతం పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ అన్నారు.

===========================

వికసిత్ భరత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ రూపొందించామని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్ సభలో బడ్జెట్ పై చర్చలో ఈరోజు ఆమె మాట్లాడుతూ... రాష్ట్రాలకు కేంద్ర బడ్జెట్ లో 25.44 లక్షల కోట్ల రూపాయలను కేటాయించామని చెప్పారు. గతంలో కంటే ఎక్కువగా బడ్జెట్ కేటాయింపులు జరిగాయని అన్నారు. రైతులు, మహిళలు, యువత సహా అన్ని వర్గాలకూ బడ్జెట్ లో ప్రాధాన్యత ఉందని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

===========================

లోక్‌సభలో అధికార పార్టీ నాయకులపై నిరాధారమైన ప్రకటనలు చేసిన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపైన సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. పార్లమెంటు

ఆవరణలో పాత్రికేయులతో ఆయన ఈ రోజు మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరిలపై రాహుల్ గాంధీ తప్పుడు ఆరోపణలు చేశారని అన్నారు. ఇది తీవ్రమైన హక్కుల ఉల్లంఘన అని పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

ఇదిలా ఉండగా భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం గురించి రాహుల్ గాంధీ చేసిన ఆరోపణపైన కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ స్పందిస్తూ... రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్వేత విప్లవం 2.0 ద్వారా రాబోయే ఐదు సంవత్సరాలలో పాడి పరిశ్రమ సహకార సంఘాల ద్వారా పాల సేకరణను 50 శాతం పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ తెలిపారు. రాజ్యసభలో ఈ రోజు ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ... 2028-29 చివరి నాటికి పాల సేకరణ రోజుకు 1,007 లక్షల కిలోలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. పాడి పరిశ్రమ ద్వారా ఉపాధిని కల్పించడం, మహిళా సాధికారతను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యాలుగా చెప్పారు. అదే విధంగా దేశవ్యాప్తంగా 75 వేల నూతన పాడి పరిశ్రమ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని కేంద్రం ప్రతిపాదించిందన్నారు. దీని వల్ల ఎక్కువ మంది మహిళా రైతులను పాడి పరిశ్రమ సహకార రంగంలోకి తీసుకురావాలన్న ఉద్దేశ్యంలో ఉన్నామని మురళీధర్ మోహోల్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈశాన్య ప్రాంతాలను మరింతగా అభివృద్ధి చేసే లక్ష్యంతో కేంద్ర బడ్జెట్ లో అధిక కేటాయింపులు చేసినట్టు కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. గౌహతిలో పాత్రికేయులతో ఈ రోజు ఆయన మాట్లాడుతూ... కేంద్ర బడ్జెట్ 2026-27 చారిత్రాత్మకమైనదని, దేశ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడినదని అన్నారు. ఈ బడ్జెట్ తో ఈశాన్య ప్రాంతాలలో గణనీయమైన మార్పు వస్తుందని చెప్పారు. గ్రామాలు, పేదలు, రైతులు, యువత, మహిళలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందించారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాల కారణంగా పేదరికం క్రమంగా తగ్గుతోందని చెప్పారు. ఈ సంవత్సరం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ బడ్జెట్‌ను 21 శాతం పెంచినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ఆయనకు ఈ రోజు నివాళులు అర్పించారు. సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన దార్శనికుడు, జాతి నిర్మాత అని సామాజిక మాధ్యమం ద్వారా పెట్టిన పోస్టులో ఉప రాష్ట్రపతి పేర్కొన్నారు. దేశంలోని ప్రతి తరానికి మార్గదర్శకునిగా దీన దయాళ్ ఉపాధ్యాయ నిలుస్తారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా లోకసభ స్పీకర్ ఓం బిర్లా ఆయనకు నివాళులర్పించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ ఉభయ సభలలో 2026-27 కేంద్ర బడ్జెట్‌పై చర్చ ఈ రోజు జరిగింది. ఈ సందర్భంగా లోక్ సభలో ప్రతిపక్ష పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ... కేంద్ర బడ్జెట్‌లో నిర్దిష్టంగా ఏ వర్గానికి ప్రయోజనాలు లేవని విమర్శించారు. ఇంజనీరింగ్, ఐటీ రంగంలో AI వల్ల చాలా ఉద్యోగాలు పెను సవాళ్లను ఎదుర్కొంటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌జెపి(ఆర్) సభ్యుడు అరుణ్ భారతి మాట్లాడుతూ... 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం అనే లక్ష్యాన్ని

సాధించడానికి బడ్జెట్ పునాది వేస్తుందని చెప్పారు. సిక్కిం క్రాంతికారి మోర్చా సభ్యుడు ఇంద్ర హంగ్ సుబ్బా మాట్లాడుతూ... భారతదేశాన్ని స్వావలంబన దిశగా నడిపించడానికి అన్ని రంగాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్‌కు బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గిపోయాయని ఆప్‌కు చెందిన ఎంపీ డాక్టర్ రాజ్ కుమార్ చబ్బేవాల్ విమర్శించారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే దార్శనికతకు బడ్జెట్ నిదర్శనంగా ఉందని బిజెపికి చెందిన సుధీర్ గుప్తా పేర్కొన్నారు. ఈ బడ్జెట్ పేదలకు సంక్షేమం, మహిళలకు బలం, రైతులకు పురోగతి, యువతకు అవకాశాలను అందిస్తుందని బిజెపి సభ్యుడు అనురాగ్ సింగ్ ఠాకూర్ అన్నారు. వృద్ధి మాత్రమే సరిపోదని, ఉపాధి విధాన ఆలోచన కూడా కేంద్రంగా ఉండాలని మాజీ ప్రధానమంత్రి, జెడి(ఎస్) నాయకుడు హెచ్.డి.దేవెగౌడ రాజ్యసభలో జరిగిన చర్చ సందర్భంగా అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో సౌర మాడ్యూల్ తయారీ సామర్థ్యం 144 గిగావాట్లకు చేరుకుంది. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ ప్రశ్నలకు సమాధానం ఇస్తూ... కేంద్ర నూతన పునరుత్పాదక ఇంధన శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి ఈ విషయాన్ని తెలిపారు. గతంలో సౌర విద్యుత్ ఉత్పత్తి 6 నుండి 7 గిగావాట్లు మాత్రమే ఉండేదని, ఇప్పుడు పెరిగిన సామర్థ్యంతో దేశం దానిని ఎగుమతి చేయగలిగే స్థితిలో ఉందని కేంద్రమంత్రి చెప్పారు. గత 11 సంవత్సరాల NDA ప్రభుత్వ పాలనలో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి లక్షా 27 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులను కేటాయించామని గుర్తు చేశారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ మొదటి దశ కింద ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు 10 వేల కోట్ల రూపాయలు, గ్రీన్ ఎనర్జీ కారిడార్ రెండవ దశ కింద 12 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు ప్రహ్లాద్ జోషి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్ లో 14 వేల 205 కోట్ల రూపాయలను రైల్వే బడ్జెట్ గా కేటాయించినట్లుగా రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. లోక్‌సభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ ప్రశ్నలకు సమాధానంగా ఆయన మాట్లాడుతూ... పశ్చిమ బెంగాల్‌లో రైల్వే ప్రాజెక్టులకు 4 వేల 662 హెక్టార్ల భూమి అవసరమని, అందులో ఇప్పటివరకు 27 శాతం మాత్రమే సేకరించామని తెలియజేశారు. రాష్ట్రంలో అనేక రైల్వే ప్రాజెక్టులు ఉన్నాయని, వాటిలో భూసేకరణ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని చెప్పారు. మహారాష్ట్రలో ప్రస్తుతం లక్షా 50 వేల కోట్ల రూపాయల విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని కేంద్రమంత్రి తెలిపారు. ఆ రాష్ట్రానికి రైల్వే బడ్జెట్ లో 23 వేల 926 కోట్ల రూపాయలు కేటాయించినట్లుగా వెల్లడించారు. రాష్ట్రంలోని పారిశ్రామిక నగరాలను అనుసంధానించడానికి అనేక కొత్త ప్రాజెక్టులను కూడా చేపట్టినట్లు అశ్విని వైష్ణవ్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రానికి వచ్చే యాత్రికులకు బీమా సౌకర్యం కల్పిస్తామని ఉత్తరాఖండ్ రాష్ట్ర పర్యాటక, మత సంబంధమైన వ్యవహారాల శాఖా మంత్రి సత్పాల్ మహారాజ్ తెలిపారు. రాష్ట్రంలో పర్యాటకం మతపరమైన కార్యకలాపాలను సురక్షితంగానే కాకుండా సమగ్రంగా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. చార్ ధామ్ యాత్ర ప్రారంభమవుతున్న నేపథ్యంలో యాత్రికులు, పర్యాటకులకు భద్రతతో పాటు మెరుగైన సౌకర్యాలను అందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

టీ-20 ప్రపంచ కప్ లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా వెస్టిండీస్, ఇంగ్లాండ్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచి ఇంగ్లాండ్ బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్ ప్రారంభించిన వెస్టిండీస్ 17 ఓవర్లకు 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. అంతకుముందు శ్రీలంకలోని కొలంబో వేదికగా ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 67 పరుగులతో విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =